RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 13 పేజీలు - 08 గురువారం 11 డిసెంబర్ 2025

## 23న ఎన్‌డబ్ల్యూడీఏ వార్షిక సమావేశం

### - ఇంటర్ రివర్ లింకింగ్ స్పెషల్ కమిటీ భేటీ

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 10 :** నేషనల్ వాటర్ డెవలప్‌మెం ట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) 39వ వార్షిక సమావేశం ఈ నెల 23న జరుగనున్నది. దీనిలో భాగంగానే ఇంటర్ లింకింగ్ ఆఫ్ రివర్స్ స్పెషల్ కమిటీ 24వ సమావేశం కూడా నిర్వహించనున్నారు. ఈమేరకు ఎన్‌డబ్ల్యూడీఏ బుధవారం అన్ని రాష్ట్రాల కు ప్రత్యేకంగా సమాచారం ఇవ్వడంతోపాటు ఎజెండాను కూడా పంపింది. ఈ సమావేశంలో గోదావరి-కావేరి(జీసీ) రివర్ లింక్ ప్రాజెక్టుపై కూడా చర్చించనున్నారు. రివర్ లింకింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇప్పటికే జీసీ లింక్‌పై కో బేసిన్ రాష్ట్రాలతో పలు దఫాలుగా చర్చించింది.

ప్రాజెక్టు అమలు ముసాయిదా ఒప్పందంపై కూడా చర్చించింది. తెలంగాణ సహా పలు రాష్ట్రాలు జీసీ లింక్‌పై అభ్యంతరాలు చె ప్పాయి. 23న ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో మరోసారి చర్చించనున్నారు. నేషనల్ పర్‌స్పెక్టివ్ ప్లాన్‌లో భాగమైన మరో 13 రివర్ లింకింగ్ ప్రాజెక్టులు, ఇంట్రా రివర్ లింక్ ప్రాజెక్టుల పురోగతి, ఎన్‌డబ్ల్యూడీఏ వార్షిక బడ్జెట్‌పై సమీక్షించనున్నారు.



## 'మీ డబ్బు.. మీ హక్కు'

### అన్‌క్లెయిమ్డ్ మనీ సొంతం చేసుకోండి

### ప్రధాని మోడీ మరోమారు పిలుపు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, 10 :** అన్ క్లెయిమ్డ్ ఆస్తు విషయంలో ఆర్‌బిఐ ఇటీవలే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా తనవంతుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇది ప్రజలకు మేలు చేస్తుందన్న భావనలో ఆయన ప్రకటన చేశారు. క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకు నేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో మిగతా2లో...

## ఉస్మానియా వర్సిటీకి

# మహర్దశ

- వెయ్యికోట్లు విడుదలకు సిఎం రేవంత్ అంగీకారం
- వెంటనే విడుదలకు విద్యాశాఖ ఉత్తర్వులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి కంకణం
- తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం
- ధైర్యంతో కాదు...గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా...
- ఉస్మానియా సభలో సిఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 10 :** ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని మిగతా2లో...



## కేంద్ర సమచార , కేంద్ర విజిలెన్స్ కమిషన్ నియామకం

### ప్రభుత్వ ప్రతిపాదనలను విభేదించిన రాహుల్

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, 10 :** కేంద్ర సమచార కమిషన్, కేంద్ర విజిలెన్స్ కమిషన్ వంటి పారదర్శక సంస్థలకు కీలక నియామకాలు ఖరారు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్యానల్ బుధవారంనాడు నిర్వహి ంచిన ఉన్నత స్థాయి సమావేశం ముగిసింది. ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో పాటు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. సుమారు 88 నిమిషాల పాటు సమావేశం జరిగింది. రాహుల్ గాంధీ పీఎంఓ కార్యాలయానికి ఒంటిగంట సమయానికి చేరుకున్నా రు. 1.07 నిమిషాలకు సమావేశం మిగతా2లో...

## అమెరికాలో బిజీగా లోకేశ్ పర్యటన

### గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌లతో భేటీ



**తొలి అక్షరం/శాన్ ఫ్రాన్సిస్కో,డిసెంబర్ 10 :** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో అమెరికాలో పర్యటిస్తున్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ టెక్ దిగ్గజ సంస్థల సీఈవోలతో సమా వేశమయ్యారు. శాన్ ఫ్రాన్సిస్కోలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవో శంతను నారా యణన్‌లతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు.

మిగతా2లో...

## గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని విధంగా

# పెట్టుబడులు

- పేరెన్నిక గన్న కంపెనీలతో పలు ఒప్పందాలు
- ముందస్తు కార్యక్రమాలతోనే రాహుల్, ఖర్గేలు రాలేదు
- త్వరలోనే పార్టీ పదవుల భర్తీని పూర్తి చేస్తాం
- మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**తొలి అక్షరం/హైదరాబాద్, 10:** గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని స్థాయిలో తెలంగాణ కు పెట్టుబడులు వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే తమ ప్రభుత్వానికి ఒప్పందాలు జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోయారని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడి యాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు.తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే మిగతా2లో...






- ఎన్నికల నిర్వహణకు సర్వసిద్ధం
- తొలి విడతలో మొత్తం 189 మండలాలు
- 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు
- రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- తొలి విడతలో ఓటేయనున్న 56,19,430 మంది ఓటర్లు
- గ్రామాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్
- మధ్యాహ్నామే ఓట్ల లెక్కింపు...ఫలితం ప్రకటన
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

## నేడే తొలివిడత

# పంచాయితీ పోరు

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 10 :** తెలంగాణ రాష్ట్రంలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. ఇప్పటికే జోరుగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు నేటి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబో తున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీ ఎన్నికల్లో పోటీ పెరిగింది. తెలంగాణలో తొలి దశ గ్రామ పంచా యతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగను న్నాయి. హైదరాబాద్‌లో మిగతా2లో...

## తొలివిడత పంచాయితీకి భారీ బందోబస్తు

### - రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి


2లో

## గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ దోపిడీ ప్లాన్

### - రైజింగ్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్న హరీష్


2లో

## అగ్రస్థాయి స్టార్టప్స్‌లో


# గూగుల్ ఒకటి

- గూగుల్‌ది.. నేడు ప్రపంచస్థాయిలో అగ్రస్థానం
- సమిష్టి కృషికి ఇదో పెద్ద నిదర్శనం
- స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వేల కోట్లు
- గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 10 :** హైదరాబాద్: తెలంగాణలో స్టార్టప్ కంపెనీను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వెయ్యి కోట్ల రూ పాయలతో స్టార్టప్ ఫండ్‌ను ఏర్పా టు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎ. రే వంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నిధుల ను సద్వినియోగం చేసుకుని స్టార్టప్ కంపెనీలను ప్రారంభించడమే కా కుండా కనీసం 1బిలియన్ డాలర్ల కంపెనీలుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ టీ-హ బ్‌లో ఏర్పాటు చేసిన గూగుల్ ఫర్ స్టార్ట ప్స్ హబ్‌ను ము ఖ్యమంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బా బుతో కలిసి ప్రారంభించారు.

మిగతా2లో...



## ఫోన్ ట్యాపింగ్ కేసు నేటికి

# వాయిదా

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,డిసెంబర్ 10:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ సుప్రీంకోర్టులో గురువారానికి వాయిదా పడింది. ఈ సందర్భంగా, కేసు దర్యాప్తునకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనానికి ఒక ముఖ్య విషయాన్ని తెలియజేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు దర్యాప్తు సంస్థతో ఏమాత్రం సహకరించడం లేదని, దర్యాప్తు సంస్థతో ఆయన ఆటలాడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, కీలకమైన రుజువులను నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రభాకర్ రావు తన ఐక్లౌడ్‌లోని డేటాను డిలీట్ మిగతా2లో...

# 'మీ డబ్బు.. మీ హక్కు'

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్÷-లకెయిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.

# నేడే తొలివిడత పంచాయితీ పోరు

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఈసీ రాణి కుముదిని విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. గురువారం జరగనున్న తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా విస్తృత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి విడతలో మొత్తం 189 మండలాలు, 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, తొలి విడతలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.ఎన్నికల నిర్వహణ కోసం సుమారు లక్ష మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. ఇందులో 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు 2,489 మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులు వినియోగించనున్నారు. ఓటర్ సౌలభ్యం దృష్ట్యా 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెల్లడించారు. మిగతా ఓటర్లు 'టీఎస్ ఈ-పోల్ మొబైల్ యాప్' ద్వారా కూడా తమ ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఓటింగ్ కేంద్రం తెలుసుకునేందుకు అదే యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఇప్పటివరకు 3,214 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా.. 31,428 మందిని బైండోవర్ చేసినట్లు, 902 లైసెన్స్డ్ ఆయుధాల డిపాజిట్, రూ.7.54 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాల స్వాధీనం చేసినట్లు రాణి కుముదిని వెల్లడించారు. నిన్న సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు మూసివేశామని ఆమె తెలిపారు. భద్రతా చర్యలలో భాగంగా 31 జిల్లాల అధికారులకు మేజిస్ట్రేట్ పవర్స్ ఇచ్చామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ఎన్నికల ప్రచారం కూడా మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, భయభ్రాం తులు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియో గించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ఓటు కీలకమని పేర్కొంటూ, గ్రామాల భవిష్యత్తు నిర్ణయంలో ఓటు శక్తిని గుర్తించాలని ఆమె అన్నారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

# ఉస్మానియా వర్సిటీకి మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ.1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ.45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడు తున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు. విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రూ.1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లీష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని విధంగా పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్. ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుందని తెలిపారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లావాదేవీలలో భాగంగానే కవిత – బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని విమర్శించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను టీపీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ అంటే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. మీడియాలోనే తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తున్నారని చెబుతున్నారని.. అప్పుడే మంత్రి పదవి ఇస్తున్నారంటూ కూడా ఊహాగానాలు వస్తున్నాయని తెలిపారు. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారని ప్రశంసించారు మహేశ్ కుమార్ గౌడ్. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాహర్ లాల్ నెహ్రూను విమర్శిస్తూ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని మండిపడ్డారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే బయపడ్డారని ఎద్దేవా చేశారు. 1965లో ఇందిరాగాంధీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారని... 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లడం చరిత్రగా నిలిచిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# తొలివిడత పంచాయితీకి భారీ బందోబస్తు

## • రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 10:** తెలంగాణలో గురువారం జరిగే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. జిల్లాల పోలీస్ యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లుచేసిందన్నారు. మొత్తం 3,800కు పైగా పంచాయతీల్లో ఎన్నికలు జరగనుండగా.. 3వేల పంచాయతీల్లో పోలింగ్‌ను నేరుగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. బందోబస్తులో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఇతర స్పెషల్ పోలీస్ సిబ్బంది కూడా పాల్గొంటారని తెలిపారు.సాధారణ పోలింగ్ కేంద్రాలతో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది పూర్తి స్థాయి విధుల్లో ఉంటారన్నారు. ఇప్పటి వరకు రూ.8.20 కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. 54 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేస్తున్నాయన్నారు. ప్రజలంతా తనిఖీలకు సహకరించి.. ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

# కేంద్ర సమచార , కేంద్ర విజిలెన్స్ కమిషన్ నియామకం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైంది. సమావేశానంతరం అత్యున్నత పదవులకు మోదీ ప్రతిపాదించిన పేర్లతో విభేదిస్తున్నట్టు రాహుల్ పేర్కొంటూ లిఖితపూర్వకంగా తన అసమ్మతి నోట్‌ను అందజేశారు. కాగా, ప్రస్తుతం సీఐసీలో ప్రధాన సమాచార కమిషనర్‌తో పాటు 8 కమిషనర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 30,838 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి ముందు సీఐసీగా ఉన్న హీరాలాల్ సామరియా 65 ఏళ్లు పూర్తికావడంతో గత సెప్టెంబర్ 13న పదవీ విరమణ చేశారు. 2023 నవంబర్ 6న ఆయన సీఐసీగా నియమితులయ్యారు. కాగా, మే 21న సీఐసీ పోస్టుకోసం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇవ్వడంతో 83 అప్లికేషన్లు వచ్చినట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెర్సనల్ అండ్ ట్రైనింగ్ అధికారులు తెలిపారు. సీఐసీలోని సమాచార కమిషనర్ ఖాళీలకు 161 అప్లికేషన్లు అందినట్టు ప్రభుత్వం తెలిపింది. నిబంధనల ప్రకారం, సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 12(3) కింద చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ నియామకాలకు పేర్లను ప్రధాని సారథ్యంలోని కమిటీ ఎంపిక చేసి తమ సిఫార్సులను రాష్ట్రపతికి పంపుతుంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత నియామక ఉత్తర్వులు జారీ అవుతాయి.

# అమెరికాలో బిజీగా లోకేశ్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో జరిగిన సమావేశంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న 15 బిలియన్ డాలర్ల ఏఐ డేటా సెంటర్ పనుల పురోగతిపై ప్రధానంగా చర్చించారు. ఈ భారీ పెట్టుబడికి ముందుకు వచ్చినందుకు గూగుల్ బృందానికి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో రాబోతున్న డ్రోన్ సిటీలో గూగుల్ డ్రోన్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సుందర్ పిచాయ్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను సంస్థలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అమెరికా వెలుపల గూగుల్ పెడుతున్న అతిపెద్ద ఎఫ్‌డీఐ విశాఖ డేటా సెంటర్ అని ఆయన పేర్కొన్నారు. ఈ భేటీలో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ కూడా పాల్గొన్నారు. అనంతరం అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖలో అడోబ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, శంతను నారాయణన్ డైరెక్టర్‌గా ఉన్న ÷జైర్, కేకేఆర్ వంటి సంస్థల పెట్టుబడులను కూడా ఏపీకి తీసుకురావాలని కోరారు. విశాఖలోని ఫార్మా జోన్‌లో ఏర్పాటు, ఆరోగ్య సంరక్షణ రంగంలో కేకేఆర్ పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని విన్నవించారు. మంత్రి లోకేష్ చేసిన విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన శంతను నారాయణన్, తన సహచరులతో చర్చించి తగిన నిర్ణయం ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.

# అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటి

(మొదటి పేజీ తరువాయి)

హైద రాబాద్‌లో ఏర్పాటవుతున్న స్టార్టప్ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలన్న లక్ష్యంతో పని చేయాల న్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ముఖ్యమంత్రి చేసిన వ్యా ఖ్యలు ఆయన మాటల్లోనే..హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్ లు యూనికార్న్ కంపెనీలు గా ఎదగాలని ఆశిస్తున్నా. అంటే క నీసం 1 బిలియన్ డాలర్ల విలువ క లిగిన కంపెనీలు ఎదగాలి. వీటిల్లో 2034 నాటికి కనీసం 10 స్టార్టప్‌లు సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి.1998 లో స్టాన్‌ఫోర్డ్ యూ నివర్సిటీలో ఇద్దరు మిత్రులు కలిసి కాలిఫోర్నియాలో స్టార్టప్‌గా ప్రారం భించిన ఒక గ్యారేజీయే ఇప్పుడు గూగుల్‌గా అవతరించింది. ఇదెంతో స్ఫూర్తి దాయకమైన అంశం.రాష్ట్ర భవిష్యత్తు కోసం ఒక విజన్ తో ముందుకు సాగుతూ, ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచ యం చేయాలన్న లక్ష్యంతో రెండు రోజుల పాటు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌పైన గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వ హించాం. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ ప్రతినిధుల సమక్షంలో తె లంగాణ రైజింగ్ విజన్‌ను ఆ విష్క రించాం. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, అలాగే 2047 నాటికి 3 ట్రి లియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ రాష్ట్రం ఎదగాలని లక్ష్యంగా నిర్ధే శించుకున్నాం.పదిహేను ఇరవై ఏళ్ల కిందట ప్రారం భించబడిన అనేక స్టార్టప్‌లు ఇప్పు డు బిలియన్స్ డాలర్ల కంపెనీలుగా ఎదిగాయి. స్టార్టప్‌లు కూడా అదే విధంగా పనిచే యాలి. హైదరాబాద్ ప్రస్తుతం వస్తు ఉత్ప త్తి ఆధారిత స్టార్టప్‌లు, ఇన్నొవేటివ్ స్టార్టప్‌లు, ఐపీ ఇంటెన్సివ్ స్టార్టప్ లపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవస రం ఉంది. హైదరాబాద్ కేవలం స్టా ర్టప్స్ మాత్రమే కాకుండా యునికా ర్న్ కంపెనీల హబ్‌గా ఎదగాలన్నది నా ఆకాంక్ష. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూని కా ర్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తు న్నా. అంటే కనీసం 1 బిలి యన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలు ఎదగాలి. అలాగే 2034 నాటికి వాటి ల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. రాష్ట్రంలో అందుకోసం అవసరమైన ఒక మం చి వాతావరణం ఏర్పాటు చేస్తాం.స్టార్టప్‌లకు అవసరమైన సహకా రం అందించడానికి తెలంగాణ ప్ర భుత్వం, గూగుల్ కలిసి పనిచేయ బోతున్నాయి. స్టార్టప్ కోసం ప్రభు త్వం వెయ్యి కోట్లతో స్టార్టప్ నిధిని ఏర్పాటు చేస్తాం. ఆ నిధిని వినియో గించుకుని తద్వారా భవిష్యత్తులో స్టార్టప్‌లు గూగుల్ స్థాయిలో లేదాకనీసం 1 బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలని ఆశిస్తున్నామని ము ఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

# గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ దోపిడీ ప్లాన్

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 10:** కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. ఇది గ్లోబల్ సమ్మిట్ కాదని.. భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్ అంటూ వ్యాఖ్యలు చేశారు. పెట్టుబడుల కట్టు కథలు చెప్పి, కోట్లు ఖర్చు చేసి గ్లోబల్ సమ్మిట్‌ను అట్టర్ ఫ్లాప్ చేశారంటూ ఫైర్ అయ్యారు. 'విజన్ డాక్యుమెంట్‌లో విజన్ లేదు, దాన్ని చేరుకునే మిషన్ లేదు, విజన్ డాక్యుమెంట్ కాదు.. 'విజన్ లెస్' డాక్యుమెంట్. క్యూర్, ప్యూర్, రేర్ అంటూ అంటున్న రేవంత్ రెడ్డి.. తెలంగాణను కొల్లగొడుతున్న చోర్. గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవో యూల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి.

# ఫోన్ ట్యాపింగ్ కేసు నేటికి వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

చేశారని కూడా న్యాయస్థానానికి వెల్లడించారు. అయితే, ప్రభాకర్ రావు తరఫు సీనియర్ న్యాయవాది ఆ రోజు అందుబాటులో లేకపోవడంతో, ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. ఈ కీలక కేసులో విచారణ రేపు కూడా కొనసాగనుంది.

# ఆదిలాబాద్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి




**తొలి అక్షరం/ఆదిలాబాద్,డిసెంబర్ 10 :** ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. జైనథ్ మండలం తరోడ సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మృతులను ఆదిలాబాద్‌లోని జైజవాన్ నగర్, లక్ష్మీనగర్ వాసులుగా గుర్తించారు. మహారాష్ట్రకు మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

# కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి

•పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) డిసెంబర్ 10:** రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. పంచాయితీ ఎన్నికల సందర్భంగా బుధవారం మండలంలోని ఈదులకుంట తండా,బోజ్య తండా, పెద్ద మంగ్య తండా,టీక్య తండా, అమ్మాపురం, ఖానాపురం,గోపలగిరి,చీకటయపాలెం, మాటేడు, కిష్టాపురం, సోమవరపు కుంట తండా, కంటయపాలెం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే ఎక్కడలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, 25 లక్షల మంది రైతులకు రూ 21 వేలకోట్ల రుణమాఫీ చేసిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్లలో రూ. 2 కోట్ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి చేశానని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గ్రామాలలో అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులు ఇచ్చే మద్యం, డబ్బులకు ఆశపడి వారికి ఓటు వేస్తే గ్రామంలో అభివృద్ధి పనులు ఆగిపోతాయన్నారు. గ్రామాలు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వరరావు,ఆయా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు రజిని బానోతు, మాలోత్ కాలి, జాటోత్ రవి నాయక్, జాటోత్ శ్రీకాంత్ నాయక్,ముద్దం నిర్మల మహబూబ్ రెడ్డి, మహమ్మద్ మహిపాషా, యనమల సావిత్రి శ్రీనివాస్, చిదిరాల కృష్ణమూర్తి, కలువకొలను దినేష్ రాజు,గూడెల్లి కొమరమ్మ రామచంద్రయ్య, బానోత్ సాగర్, మోకాటి సుజాత వెంకన్న,ఆయా గ్రామాల ఇన్చార్జులు పెదగాని సోమయ్య, చాపల బాపు రెడ్డి, డాక్టర్ సోమేశ్వరరావు, మంగళపల్లి రామచంద్రయ్య, మాలోతు సునీత రాజేందర్, సర్వి వెంకన్న, జలకం శ్రీనివాస్, వెంకటాచారి,కుషాల్, హేమంత్ నాయక్, మనోహర్,జాటోతు రమేష్ నాయక్ పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లిన సిబ్బంది






**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో డిసెంబర్ 10:** జిల్లాలో జరగనున్న మొదటి విడత ఎన్నికలకు సిబ్బంది తరలి వెళ్ళినారు. జిల్లాలో మొత్తం (4110) పోలింగ్ స్టేషన్లుమొదటి విడత సర్పంచ్ (146), వార్డు మెంబర్ (1072) స్థానాలు,రెండవ విడత (143), వార్డు మెంబర్(1109), మూడవ విడతలో (150), వార్డు మెంబర్( 1140) స్థానాలుమొదటి,రెండవ, మూడవ విడతలలో 43 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా 789 వార్డ్ స్థానాలు ఏకగ్రీవం కాగా,200 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రానికి 1 పి.ఓ 1 ఓపిఓ బృందంగా,201 నుండి 400 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రానికి 1 పి.ఓ 2 ఓపిఓ లు 401 నుండి 650 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రానికి 1 పి.ఓ 3 ఓపిఓ లు పోలింగ్ సిబ్బంది, అదేవిధంగా 20% అదనంగా మొదటి విడతలో (1621) పి.ఓ లు, (1853) ఓపిఓ లు, రెండవ విడతలో (1632) పి.ఓ లు, (2048( ఓ.పి.ఓ లు, మూడవ విడతలో (1732) పి.ఓలు, (1894) ఓ.పిఓ లు విధులు నిర్వహిస్తారు.(10) మంది మైక్రో అబ్జర్వర్ల తో పాటు ఐదుగురు రిజర్వు ,(122) సీసీ కెమెరాల ద్వారా వెబ్ కాస్టింగ్బ్యాలెట్ బాక్సులు మొదటి విడతలో1753 మొదటి విడతలోని అయిదు మండలాలకు 49 రూట్ అధికారులు, 15 జోనల్ అధికారులు, రెండవ విడతలోని ఏడూ మండలాలకు 69 రూట్ అధికారులు,14 జోనల్ అధికారులు నియమించారు.మండలానికి ఒక పంపిణీ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

## ఊపందుకున్న ప్రచారం తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసిన బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి కోమ్ము రమేష్ యాదవ్




**తొలి అక్షరం/ నెక్కొండ డిసెంబర్ 10:** వరంగల్ జిల్లా మేజర్ గ్రామపంచాయతీ నెక్కొండ మండల కేంద్రంలో బి ఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా కొమ్ము రమేష్ యాదవ్ ప్రచారాన్ని జోరందుకున్నాడు, ప్రజలు కార్యకర్తలతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి ప్రచారాన్ని మొదలుపెట్టడం జరిగింది. ఉద్యమ కాలం నుండి తెలంగాణ రాష్ట్ర సమితిలో కీలకపాత్ర పోషిస్తూ బీసీ వర్గానికి చెందిన కొమ్ము రమేష్ యాదవ్ మేజర్ గ్రామపంచాయతీ నెక్కొండ లో సర్పంచ్ అభ్యర్థిగా ప్రజల ఆశీర్వాదాన్ని పొందడం జరిగింది. 17న జరిగే ఎన్నికలలో నెక్కొండ గ్రామపంచాయతీ లో బిఆర్ఎస్ జండా ఎగురుతుంది. అని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ప్రజలందరూ తన వెంట విశ్వాసంతో ఉన్నారని, నెక్కొండ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని ప్రజలందరి ముందు హామీ ఇవ్వడం జరిగింది. మండల అభివృద్ధికి పాటుపడతానని తెలంగాణ తల్లి సాక్షి గా నెక్కొండ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ప్రజలందరి ముందు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ నెక్కొండ ఉప సర్పంచ్ దేవెనబోయిన వీరభద్రం, మారం రాము , బి,ఆర్ ఎస్ కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి... పోలింగ్ కేంద్రాల వద్ద 163 సెక్షన్: జిల్లా ఎస్పీ వైద్యులు శబరిష్




**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో డిసెంబర్ 10:** పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వైద్యులు శబరిష్ ఆదేశించారు. బుధవారం జిల్లాలోనికేసముద్రం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఎస్పీ వైద్యులు శబరీష్ సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ నేడు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించి, అధికారులు సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 సెక్షన్ BNSS అమల్లో ఉంటుందని, 100 నుండి 200 మీటర్ల పరిధిలో ప్రత్యేక నిబంధనలు ఉండటంతో ప్రజలు అనవసరంగా గుమిగూడకూడదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల లోపల సెల్ఫోన్లు, వాటర్ బాటిల్లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు వంటి వస్తువులకు అనుమతి ఉండదని స్పష్టంచేశారు. క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలని ఓటర్లను కోరారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని, ఓటర్లు తప్పనిసరిగా తమ ఐడి కార్డులు తీసుకురావాలని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రచారం ముగిసిన నేపథ్యంలో బయట వ్యక్తులు గ్రామాల్లో ఉండకూడదని తెలిపారు. ఏవైనా అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని అన్నారు. ప్రజల్లో భరోసా కల్పిస్తు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తికావడానికి పోలీసులు కఠినంగా విధులను నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

## పోలింగ్ జరిగే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**పోలింగ్ సామగ్రితో తరలివెళ్లిన సిబ్బంది**




**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో డిసెంబర్ 10:** పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. జిల్లాలో నేడు మొదటి విడతలో ఎన్నికలు జరిగే (5) మండల కేంద్రాల నుండి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్ లు, ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమం ప్రారంభం కాగా, బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పంపిణీ కేంద్రాన్ని లిజిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు,లిజిల్లాలోని ఇనుగుర్తి, కేసముద్రం, గూడూరు,మహబూబాబాద్,నెల్లికుదురు,(ఐదు) మండలాల పరిధిలో ప్రత్యేక అధికారులు సంబంధిత ఎన్నికల సిబ్బంది మెటీరియల్ తీసుకుని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ మేటి... కాకతీయ స్కూల్ విద్యార్థి భాను విజేత

**అభినందించి బహుమతిని అందించిన కాకతీయ ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి**





**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్ 10:** సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని శాసనసభ సభ్యుడు వీర్లపల్లి శంకర్ సహకారంతో షాద్‌నగర్ టౌన్‌లోని "సాయి రాజా కన్వెన్షన్ హాల్" లో చెస్ లెవెల్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకుడు వానరాశి జగన్ సారథ్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి చదరంగం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన శ్రీ కాకతీయ హై స్కూల్ 7వ తరగతి విద్యార్థి భాను అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బహుమతి పొందాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాకతీయ స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి మాట్లాడుతూ%%చదువుతో పాటు క్రీడలలో ప్రతిభ చూపడం ప్రతి విద్యార్థి సమగ్ర అభివృద్ధికి ఎంతో కీలకం. మా విద్యార్థి భాను చెస్ పోటీలలో సాధించిన విజయం మా పాఠశాల గౌరవాన్ని మరింత పెంచింది. మా పాఠశాల సంప్రదాయంగా క్రమశిక్షణ, విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తోంది. 21 స్కిల్స్ ఆధారంగా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, క్రీడా ప్రోత్సాహం, నైపుణ్య అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జోరుగా ఇంటింటి ప్రచారం

• బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మిర్యాల మల్లేశం బ్యాట్ గుర్తును గెలిపించండి



**తొలి అక్షరం/రామన్నపేట డిసెంబర్ 10:** రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ అభ్యర్థిగా పట్టణంలోని 6,7వ, వార్డులలో సర్పంచ్ అభ్యర్థిగా మిరియాల మల్లేశం వార్డు మెంబర్ అభ్యర్థిగా మునుకుంట్ల రాణి,శ్రీలత సిపిఎం మెంబర్లగా గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతరాజు సాయి,బందెల రాములు, మామిడి వెంకట్ రెడ్డి, రామిని లక్ష్మణ్, అనిల్ గలిగ నరసింహ బొడ్డు అన్నయ్య ఎస్.కె చాంద్,బాసాని రాజు, కల్లూరి నరేష్,భావండ్లపల్లి బాలరాజు,పల్లె సత్యం, మునుకుంట్ల లెనిన్, భావండ్లపల్లి సత్యం, పొందూరు వెంకటేశ్వర్లు, రసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంపల రామచంద్రారెడ్డి గెలుపు ఊరి అభివృద్ధికి మలుపు




**తొలి అక్షరం/రామన్నపేట,డిసెంబర్10:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రామన్నపేట మండలం బోగారం గ్రామ సర్పంచ్ అభ్యర్థి గంపల రామచంద్రారెడ్డి వార్డు సభ్యులకు మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నిర్వహించారు. బోగారం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి,భారీ జన సమూహంతో ర్యాలీ నిర్వహించిన అనంతరం వారు ప్రసంగిస్తూ గంపల రామచంద్రారెడ్డి గెలుపు గ్రామాభివృద్ధికి మలుపని,కాంగ్రెస్ పార్టీ చేసే అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రజలు సంతోషపడుతున్నారని,రాష్ట్రంలో ఏ పార్టీ అయితే అధికారంలో ఉంటుందో ఆ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని,ఈ గ్రామానికి 50 ఇందిరమ్మ ఇండ్లు కాదు 60 వరకు ఇవ్వడానికి నేను సిద్ధపడ్డానని,ఊరు అభివృద్ధి చెందాలంటే గంపల రామచంద్రారెడ్డి కి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,గ్రామశాఖ నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్

**వేముల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన టిఆర్ఎస్ నాయకులు**

**గ్రామం అభివృద్ధి కావాలంటే కందిమల్ల గోపాల్ రెడ్డిని గెలిపించండి: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**



**తొలి అక్షరం/రామన్నపేట డిసెంబర్ 10:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రామన్నపేట మండలం నీర్నంల కాంగ్రెస్ పార్టీ కందిమల్ల గోపాల్ రెడ్డి కి వార్డు సభ్యులకు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అనంతరం మాట్లాడుతూ గ్రామానికి సుమారుగా 30 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాను గ్రామంలో ఉన్న అర్హులైన ప్రతివారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాను కాంగ్రెస్ అభ్యర్థిని తప్పకుండా గెలిపించాలని తెలిపినారు. బిఆర్ఎస్‌కి చెందిన పలువురు నాయకులు మాజీ ఎంపీటీసీ రామ్ సునీత శివకుమార్ రైతు సమన్వయ సమితి మండల నాయకులు శేఖర్ రెడ్డి గ్రామ శాఖ సీనియర్ నాయకులు చిప్పలపల్లి ఎల్లయ్య కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



# రామన్నపేట అభివృద్దే నా ధ్యేయం

**రామన్నపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థి గరిక సత్య నారాయణ**


**ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి**

**గరిక ఫౌండేషన్ ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా వివిధ రూపాలలో పట్టణ ప్రజలకు సేవ చేస్తూ వస్తున్నాను.**



**తొలి అక్షరం/రామన్నపేట డిసెంబర్ 10:** రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ ఉన్న ఊరు కన్నతల్లి కన్నతల్లికి సేవ ఉన్న ఊరును అభివృద్ధి చేయడానికి మీరు ఆశీర్వదించి నన్ను గెలిపిస్తే పూజ్య బాపుజీ కలలు కన్నట్టుగా ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో క్రమశిక్షణతో గ్రామ అభివృద్ధి పరిపాలన అందిస్తాను,గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవినీతికి తావు లేకుండా గౌరవప్రదమైన సేవలందిస్తాను,గ్రామంలో సోలార్ సిస్టం కరెంటు ఏర్పాటు చేయిస్తా,స్ట్రీట్ క్లీనింగ్ మిషన్ ఏర్పాటు చేయిస్తా,పట్టణంలో మౌలిక సదుపాయాలైన త్రాగునీరు, పారిశు ధ్యం,వీధి దీపాల మెరుగుదల నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తాను, పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి ప్రతి నెల కార్యవర్గ సమావేశం, మూడు నెలలకొకసారి గ్రామసభ నిర్వహిస్తాను, స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం సహకారంతో పట్టణానికి ఆనుకొని ఉన్న వెంకట్రామయ్య చిన్న చెరువుకు కొమ్మాయిగూడెం పెద్ద చెరువు నుండి ఫీడర్ ఛానల్ నిర్మించడానికి నా వంతు కృషి చేస్తాను, మరియు చెరువుల మినీ ట్యాంక్ బండ్ గా తీర్చిదిద్ది చెరువు కట్టపై వాకింగ్ ట్రాకింగ్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాను, పట్టణ ప్రజల దాహాన్ని తీర్చడానికి సొంత నిధులను వెచ్చించి ప్రజలకు ఉపయోగపడే విధంగా అవసరమైన చోట ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తాను, పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆధునికరింప జెసి యువత నిరుద్యోగులకు పోటీ పరీక్షకు ఉపయోగపడే విధంగా స్టడీ మెటీరియల్ హిస్టారికల్ పుస్తకాలను ఏర్పాటు చేస్తాను,యువత మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యం పెంపొందించుకోవడానికి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తాను,విద్యావంతులు, అనుభవిజ్ఞులతో యువతకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల ఏర్పాటుకు కృషి చేస్తాను, వృద్ధులు వికలాంగులు వితంతువుల సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రం(హెల్ప్ డిస్క్)ఏర్పాటు చేసి ప్రత్యేక ఉద్యోగిని నియమిస్తాను, గ్రామ కంఠంలోని భూములను గుర్తించి అన్యాక్రాంత కబ్జాలను గురికాకుండా పరిరక్షిస్తాను, కూరగాయలు,మాంసం విక్రయాలకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేస్తాను, గ్రామ పంచాయితీ ఆదాయ వనరులను పెంపొందించడానికి ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో కృషి చేస్తాను, ప్రతి వీధిలో సిసి రోడ్లు మురికి కాలువల నిర్మాణం ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణం చేయడానికి కృషి చేస్తానని తెలియజేస్తూ మీరు నన్ను అనగా గరిక సత్యనారాయణ ను సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సదా మీ సేవలో...

## గ్రామస్తుల ఐకమత్యం., అబివృద్ధికి నిదర్శనం: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**తొలి అక్షరం/రామన్నపేట డిసెంబర్ 10:** రామన్నపేట మండలంలోని నిదాన్ పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నారపాక మాధవి - యాదయ్య కి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందనలు తెలిపారు..గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ మరియు పాలకవర్గ సభ్యులకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు..కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు మెచ్చి ప్రజలు పార్టీలకు అతీతంగా ఏకతాటిపైకి వస్తున్నారనటానికి ఈ ఏకగ్రీవ ఎన్నికలే నిదర్శనమని చెప్పారు..

# దళిత బిడ్డ నాయకుడిగా ఎదగాలని 50 వేల ఆర్థిక విరాళం

**● ఓ..కాంగ్రెస్ పార్టీ సీనియర్ దాతృత్వం**



**తొలిఅక్షరం,చెన్నారావుపేట డిసెంబర్,10:** మండల కేంద్రం లోని కోనాపురం గ్రామానికి చెందిన మైదం రాకేష్ కి భారీ విరాళంగా 50 వేల రూపాయలను అందించి సర్పంచ్ అభ్యర్థిగా గెలవాలని, యువతరం ముందుకొచ్చి రాజకీయాల్లో గ్రామాలలో మంచి మార్పును తీసుకురావాలని అందుకు గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా తనకు ఇచ్చిన మద్దతును చూసి ఆర్థికంగా అతన్ని ముందుకు తీసుకొచ్చి ప్రోత్సహిస్తున్న మన్నారు.అంతే కాకుండా నర్సంపేట నియోజక వర్గ అభివృద్ధి ప్రదాత దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగిరి ప్రతి పల్లె అభివృద్ధిని సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ సొసైటీ వైస్ చైర్మన్ తోగరు చెన్నారెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం మైదం రాకేష్.(కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి),మాట్లాడుతూ..ఒక సామాజిక వర్గం నుంచి పోటీ చేస్తున్న తనను ఇంతలా ప్రోత్సహిస్తున్న తోగురు చేన్నారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ చేస్తున్నా మన్నారు.అంతే కాకుండా గతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, సాంస్కృతిక,స్వచ్ఛంద సేవా సంస్థల్లో పలు సేవా కార్యక్రమాలను తొగరు చెన్నారెడ్డి నిర్వహించారని, ఒక దళిత బిడ్డనైన తనని నాయకుడిగా చూడాలని తన గొప్ప దానగుణానికి నిదర్శనంగా నాకు అందిన హార్ధిక విరాళం ఒక ఉదాహరణగా నిలుస్తుందని, తెలియజేశారు. అ తను గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు తనకు అండగా నిలబడి సర్పంచ్ అభ్యర్థిగా తనని గెలిపిస్తే ఊరికి నాయకుడిలా కాకుండా సేవకుడిలా పనిచేస్తానని తెలియజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో బిజెపి నాయకుడు

**గ్రామ గ్రామాన పోటీనిస్తున్న బిజెపి**



**తొలిఅక్షరం/నర్సంపేట డిసెంబర్ 10 :** నియోజకవర్గంలోని నల్లబెల్లి మండలం, ఆసరవెల్లి గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ బలపర్చిన ఆసరవెల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బానోతు వీరన్న గెలుపు కోసం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి. ప్రచారంలో భాగంగా రాణా ప్రతాప్ రెడ్డి భారతీయ జనతా పార్టీ బలపర్చిన అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటికి వెళ్ళి ప్రజలతో ముచ్చటించి గ్రామ పంచాయతీ లో ఉన్న సమస్యలను తెలుసుకొని, బీజేపీ బలపర్చిన అభ్యర్థిని గెలిపిస్తే సమస్యలను పరిష్కారం చేస్తాం అని హామీ ఇచ్చారు.ఆసరవెల్లి గ్రామ పంచాయతీ భారతీయ జనతా పార్టీ బలపర్చిన అభ్యర్థిగా చదువుకున్న యువకునికి అవకాశం కల్పించామని కావున యువత ఆలోచించి ఓటు వేయాలని తెలియచేశారు.ఆలోచించి గ్రామ అభివృద్ధి కోసం ఆసరవెల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బానోతు వీరన్న కత్తెర గుర్తు మీద ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని తెలియచేసారు.

# మా జీతాలను ట్రెజరీ శాలరీ పరిధిలోకి తీసుకురండి

**ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకమైన సేవలు అందిస్తున్నాం**

**వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేదు**

**సూపరింటెండెంట్ కు వినతి పత్రం అందజేసిన వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు**



**తొలి అక్షరం/షాద్ నగర్,డిసెంబర్ 10:** ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకమైన సేవలు అందిస్తున్నప్పటికీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేనందువలన నెలనెలా వేతనాలు ఆలస్యం కావడంతో పాటు ఇంకా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నందున వైద్య విధాన పరిషత్ ను రద్దుచేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేసి ట్రెజరీ శాలరీస్ పరిధిలోనికి తీసుకురావాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సామూహిక వినతి పత్రాలు అందించే కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి షాద్ నగర్ నందు ఉద్యోగులు సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్ కి ఉద్యోగుల సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ పద్మలత, డాక్టర్ సుప్రజ, డాక్టర్ మాధవి, నర్సింగ్ సిబ్బంది హేమలత, పారా మెడికల్ సిబ్బంది సునీత ఫార్మాసిస్టు పూర్ణిమ నందకిషోర్ లక్ష్మి నాల్గవ తరగతి శ్రేణి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి...

**● సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గొల్లపల్లి నాగయ్య ● ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం పార్టీ బలపరచిన అభ్యర్థులనే గెలిపించండి**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో డిసెంబర్ 10:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గొల్లపల్లి నాగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సిపిఎం పార్టీ భూ పోరాట కేంద్రంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అనునిత్యం ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడే సీపీఎం పార్టీ గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను గెలిపించాలని అన్నారు.ఎన్నికలు అనగానే గ్రామాలలో రకరకాల జండాలు వెలుస్తాయని అటువంటి జెండాలు ప్రజలకు సమస్యలు ఉన్నప్పుడు ఎప్పుడు కనిపించవని అటువంటి ఎన్నికల పార్టీలను కాకుండా ప్రజా పార్టీ అయినా సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థులను స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలిపించాలని అన్నారు. సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే కేరళ రాష్ట్రంలో ఏ విధంగా అయితే గ్రామాలు అభివృద్ధి బాటన నిలిచి విద్యా ఉపాధి అన్ని వసతులున్న రాష్ట్రం కేరళ పేదలు లేని రాష్ట్రంగా, ప్రకటించుకున్న ఏకైక రాష్ట్రం సిపిఎం పార్టీ పరిపాలిస్తున్న, కేరళ రాష్ట్రం అదే విధంగా మన కాడ కూడా అభివృద్ధి దిశగా బాటలు వెయ్యాలంటే సిపిఎం పార్టీని ఆదరించాలని అన్నారు.నిత్యవసర వస్తువులైన గ్యాస్,పెట్రోల్ వంటనూనె వంటి సమస్యల నుండి స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే భూ సమస్యలు కావచ్చు ఇతర గ్రామపంచాయతీ స్థాయి సమస్యలు రోడ్లు,నీళ్లు,రేషన్ కార్డులు,డబల్ బెడ్ రూమ్,ఇందిరమ్మ ఇల్లు,ముఖ్యంగా రైతు సమస్యలు ఉపాధి హామీ వంటి పథకాలు అందరికి అందించాలని పోరాటంలో ముందుండే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ప్రభుత్వాలు మారినప్పటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని పరిష్కారం దిశకు వెళ్లే మార్గం లేకుండా ఉందని సమస్య పరిష్కార దిశగా వెళ్లాలి అంటే సీపీఎం అభ్యర్థులను గ్రామ సర్పంచులుగా గెలిపించాలని అన్నారు.ఎప్పుడూ పేద ప్రజలను అంటిపెట్టుకొని ప్రజాసమస్యలపై పోరాడుతూ ప్రతి సమస్య పై దృష్టి సారించి సమస్య పరిష్కారం కోసం పోరాటమే మార్గంగా పీడిత ప్రజలను సంఘటితం చేస్తూ ప్రజా పోరాటాలను నిర్వహిస్తున్న అభ్యర్థులను గెలిపించి ప్రజా పక్ష పాలకవర్గాన్ని ఏర్పరుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాదుల శ్రీనివాస్, సుర్నపు సోమయ్య, శాఖ కార్యదర్శిలు, పార్టీ సభ్యులు సానుభూతిపరులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతి హై స్కూల్ చంద్రుగొండలో మానవ హక్కుల దినోత్సవం

**● పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వర్**





**తొలిఅక్షరం/నెక్కొండ డిసెంబర్ 10:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని క్రాంతి హై స్కూల్ చంద్రుగొండ లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులతో పలు రకాల స్కిట్లను సాంస్కృతిక కార్యక్రమాలను , మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులు వ్యాసరచన స్పీచ్ లు 1948 డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని ప్రస్తుతం ఉన్నటువంటి సమాజంలో మానవుని యొక్క విలువలు కోల్పోతున్నారని,మానవత్వాన్ని మరిచి సమాజంలో వికృతమైనటువంటి విధానాలను చేపడుతున్నటు వంటి తరుణంలో,ముఖ్యంగా మహిళల పై జరుగుతున్న అఘైత్యాలు కావచ్చు, యాసిడ్ దాడులు కావచ్చు ఇవన్నీటి గురించి మాట్లాడుతూ ఫైట్ ఫర్ రైట్, హక్కుల కోసం పోరాడడం, ప్రస్తుత సమాజంలో మానవతా విలువలను కోల్పోతున్నారని, క్రాంతి హై స్కూల్ లోని ఆడిటోరియంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వరరావు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని,విద్యార్థుల ఉద్దేశించి మానవ హక్కుల దినోత్సవం పురస్కరించు కొని , వ్యాసరచన పోటీలో మరియు ఉపన్యాస పోటీలలో ప్రథమ, ద్వితీయ తృతీయ , బహుమతులు అందించడం జరిగింది.పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల నాగేశ్వరరావు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థుల ఉద్దేశించి మానవ హక్కులను పరిరక్షణ హక్కుల పోరాటాఉపాధ్యాయున్ని , ఉద్దేశించి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు ఉపన్యసించడం జరిగింది.



# తొర్రూర్ పట్టణంలో భారీగా అక్రమ మద్యం పట్టివేత ఒకరిపై కేసు నమోదు

**• ఎన్నికల కోడ్ అమలులో కఠినంగా**

**వ్యవహరిస్తున్న పోలీసులు: తొర్రూర్ ఎస్సై జి. ఉపేందర్**



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) డిసెంబర్ 10: ఎన్నికల కోడ్ కఠినంగా అమలు జరుగుతున్న నేపథ్యంలో తొర్రూర్ పోలీసులు అక్రమ మద్యం విక్రేతలపై దృష్టి సారించారు. బుధవారం తొర్రూర్ పట్టణంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు, పెద్ద మొత్తంలో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రూ. 80,000 విలువైన మద్యం సీసాలు పట్టివేతతొర్రూర్ ఎస్సై జి. ఉపేందర్ అందించిన వివరాల ప్రకారం... అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే పక్కా సమాచారం మేరకు పోలీసులు తొర్రూర్ పట్టణానికి చెందిన పెద్ది శంకర్ అనే వ్యక్తి బెల్ట్ షాపుపై ఆకస్మిక దాడి (రైడ్) నిర్వహించారు. ఈ దాడిలో సుమారు 150 లీటర్ల అక్రమ మద్యం బీరు మరియు బ్రాందీ సీసాలు పట్టుబడింది. మార్కెట్లో దీని విలువ సుమారు ?80,000/- ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితుడు పెద్ది శంకర్ పై పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. బెల్ట్ షాపుల యజమానులకు ఎస్సై ఉపేందర్ హెచ్చరిక. ఈ సందర్భంగా ఎస్సై జి. ఉపేందర్ మాట్లాడుతూ, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించినా, లేదా మద్యం షాపుల యజమానులు ఎవరైనా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసినా, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ కార్యకలాపాలకు ఎవరూ పాల్పడొద్దని ఆయన స్పష్టం చేశారు

# పల్లెల్లో ఎన్నికలను ప్రశాంతంగా ముగించండి..

**శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్..**

**షాద్ నగర్‌లో ఎన్నికల నిర్వహణపై పోలీసులతో సమావేశం..**

**సమస్యాత్మక గ్రామాలపై దిశానిర్దేశం**

**పోలీసు బందోబస్తు పై షాద్ నగర్ పట్టణంలో సమావేశం**









తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్ 10: ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండండి.. సమస్యత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి.. పల్లె ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించండి.. ఓటర్ స్వేచ్ఛగా ఓటు వేసుకునేలా చర్యలు తీసుకోండి.. అంటూ శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్ లో గురువారం జరగనున్న సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం ఎన్నికల ప్రారంభం నుంచి సాయంత్రం ఫలితాలు వెల్లడి దాకా పోలీసులు ప్రతి చోట అప్రమత్తంగా వ్యవహరించాలని వెల్లడించారు. సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులు పర్యవేక్షించాలి అన్నారు. ఉద్రిక్తతలకు, ఆందోళనలకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ జరగాలని సూచించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు గాని, వారి అనుచరులు గాని ప్రలోభాలకు పాల్పడినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫరూక్ నగర్ మండల పరిధిలో ఇద్దరు ఏసీపీలు, పదిమంది సిఐలు, 30 మంది ఎస్సైలు, 500 మందికి పైగా పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఏసిపి రంగస్వామి, పట్టణ సీఐ విజయ్ కుమార్, డిఐ వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల బందోబస్తు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ దేయంగా ప్రభుత్వం ప్రత్యేక బందోబస్తును ఈ సందర్భంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమాలుని ప్రతి ఒక్కరు తూచా తప్పకుండా పాటించాలని లేనియెడల కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలని ఇలాంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే పోలీసులకు తెలియజేయాలని వారు సూచించారు.

# విద్యలోనే కాదు క్రీడల్లో కూడా ముందంజ కృష్ణవేణి ఉన్నంత పాఠశాల విద్యార్థులు

**అబ్బురపరిచిన విద్యార్థి వేధాదిత్య ను అభినందనలు**

**తెలిపిన కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపల్ రఫత్ సుల్తానా**





తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్ 10: సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని శాసనసభ సభ్యుడు వీర్లపల్లి శంకర్ సహకారంతో షాద్‌నగర్ టౌన్‌లోని "సాయి రాజా కన్వెన్షన్ హాల్" లో టౌన్ లెవెల్ చెస్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకుడు వానరాసి జగన్ సారథ్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చదరంగం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన కృష్ణవేణి ఉన్నంత పాఠశాల 6వ తరగతి విద్యార్థి వేధాదిత్య అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బహుమతి పొందాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా విద్యార్థిని మెచ్చుకున్నారు. కృష్ణవేణి ఉన్నంత పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలలో ప్రతిభ చూపడం ప్రతి విద్యార్థి సమగ్ర అభివృద్ధికి ఎంతో కీలకం. మా విద్యార్థి వేదదిత్య చెస్ పోటీలలో సాధించిన విజయం మా పాఠశాల గౌరవాన్ని మరింత పెంచింది. మా పాఠశాల సంప్రదాయంగా క్రమశిక్షణ, విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తోంది. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, క్రీడా ప్రోత్సాహం, నైపుణ్య అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హీట్! మూడు గ్రామాలకు రాత్రంతా 'పోలీస్ భద్రతా కవచం'


**హాట్‌స్పాట్‌లలో ఉద్రిక్తతకు చెక్: ప్రలోభాలకు తావు లేకుండా ఎస్సై పాషా టీమ్ మెరుపు గస్తీ!**

**20 మంది బలగాలతో ప్రత్యేక నిఘా: స్పెషల్ ఎస్సై షేక్ పాషా పర్యవేక్షణలో బూత్ చుట్టూ ఇంచు కూడా కదలకుండా 'కఠిన ఆపరేషన్'.**

**డబ్బు పంపిణీ దారులకు గట్టి వార్నింగ్: నాయకుల రాత్రి కదలికలపై స్పెషల్ ఫోకస్‌ఓటు కొనుగోలు ప్రయత్నాలపై ఉక్కుపాదం.**

**తార్ సింగ్ బావి, రాజుల కొత్తపల్లి, సీతారాంపురంలో తెల్లవారుజాము వరకూ ప్రశాంతత**

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ డిసెంబర్ 10: స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అత్యంత కీలకమైన, రాజకీయ ఉద్రిక్తతలు అధికంగా ఉన్న నెల్లికుదురు మండలంలోని తార్ సింగ్ బావి, రాజుల కొత్తపల్లి, సీతారాంపురం గ్రామాలలో పోలీసులు రాత్రంతా అపూర్వ స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా వీలు కల్పించడానికి, ఈ మూడు హాట్‌స్పాట్‌లపై 'పోలీస్ భద్రతా కవచం' మోహరించబడింది. ఎస్సై షేక్ పాషా నేతృత్వం స్పెషల్ ఎస్సై షేక్ పాషా ఆధ్వర్యంలో 20 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం మంగళవారం రాత్రి నుంచే విధుల్లోకి





దిగింది. గ్రామాల ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, మరియు పోలింగ్ బూత్‌ల పరిసర ప్రాంతాలన్నింటిలో పోలీసులు పహారాలు కాస్తూ, అనుమానాస్పద కదలికలు, గుంపుల గుమికూడింపులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ప్రలోభాలకు పడకుండా నిఘా ఎన్నికలకు ముందు రాత్రి ఓటర్లను డబ్బు, మద్యం లేదా ఇతర ప్రలోభాలతో ప్రభావితం చేయాలనే ప్రయత్నాలను పోలీసులు తీవ్రంగా అడ్డుకున్నారు. నాయకుల అనుచరుల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు, రాత్రిళ్లు తిరిగే వాహనాలను చెక్‌పోస్టుల వద్ద ఆపి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. "ప్రజాస్వామ్యంలో డబ్బు ప్రలోభాలకు చోటు లేదు. ఓటును కొనుగోలు చేయాలని చూసే వారిపై, శాంతి భద్రతలకు భంగం కలిగించాలని ప్రయత్నించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం," అని స్పెషల్ ఎస్సై షేక్ పాషా నిక్కచ్చిగా హెచ్చరించారు. పోలీసుల పటిష్టమైన గస్తీ, నిఘా కారణంగా ఈ మూడు గ్రామాల్లో తెల్లవారుజాము వరకూ పూర్తి శాంతి నెలకొంది. ఎన్నికల ఉద్రిక్తత లేకుండా, ప్రశాంత వాతావరణం నెలకొంది.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు అంతా సిద్ధం

**పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత**

**రేపటి పోలింగ్‌కు సమాయత్తమవుతున్న అధికారులు నుంచి సామాగ్రిని తీసుకుంటున్న సిబ్బంది**

**ఆయా గ్రామాలకు చేరుకుంటున్న పోలింగ్ సిబ్బంది మరియు పోలింగ్ సామాగ్రి**





తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్ 10: స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జిల్లాలో మొదటి విడతలో ఎన్నికలు జరిగే ఆయా మండల కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. షాద్ నగర్ మండల కేంద్రంలోని షాద్ నగర్ మినీ స్టేడియంలో పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు కొత్తూరు, నందిగామ, ఫరూక్ నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగుడ, కేశంపేట మండలాల పరిధిలో ప్రత్యేక అధికారులు సంబంధిత ఎన్నికల సిబ్బంది మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఆయా మండలాల్లోని గ్రామాలకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు ఎన్నికల సమగ్రని ఎన్నికల అధికారుల వద్ద తీసుకుంటున్న దృశ్యం రేపు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు పంచాయతీ పోలింగ్ కొనసాగనుంది ఆ తర్వాత కౌంటింగ్ ప్రారంభం కానుందని అధికారులు తెలియజేశారు.

# వందేమాతర గీతం భారతీయుల ఐక్యతను, గౌరవాన్ని పెంపొందిస్తుంది

**- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**

తొలి అక్షరం/ఖమ్మం, డిసెంబర్ 10 : వందేమాతర గీతం భారతీయుల ఐక్యతను, గౌరవాన్ని మరింత పెంపొందిస్తున్నదని, స్వాతంత్ర్య సంగ్రామంలో ఇది ప్రధాన భూమిక పోషించిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. రాజ్యసభలో బుధవారం ఆయన వందేమాతర గీతంపై జరిగిన చర్చలో పాల్గొని ప్రసంగించారు. బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ నెలలో రాసిన ఆనంద్ మఠ్ పుస్తకంలో రాసిన ఈ గీతం బ్రిటీష్ వలస పాలకులపై మన పూర్వీకులు ఆత్మగౌరవంతో పోరాడడానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. భారతీయులలో దేశభక్తి మరింత పెంపొందడానికి ఊతమిచ్చిన ఈ మహోన్నత గీతానికి 150 ఏళ్ల మహోన్నత చరిత్ర ఉందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఊరూతలూగించిన వందేమాతర గీతం తెలంగాణ ప్రాంతానికి పాకి నిజాం పాలకులపై పోరాడడానికి ప్రేరణనిచ్చిందని ఎంపీ రవిచంద్ర తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1938లో ఈ గీతాన్ని గళమెత్తి పాడిన విద్యార్థులను గది బంధించి తీవ్ర నిర్బంధం ప్రయోగించడంతో నిజాం రాజ్యమంతా ఉద్యమం ఉవ్వెత్తున లేవడంతో పాలకులు వణికిపోయారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా 1550 మంది విద్యార్థులను విద్యాసంస్థల



నుంచి బహిష్కరించడం జరిగింది. వారిని ఏ కళాశాలలో కూడా చేర్చుకోవద్దని హుకుం జారీ చేసినా నాగపూర్ విశ్వవిద్యాలయం చదువుకునేందుకు అవకాశాలు కల్పించిందని, వీరిలో మన స్వర్గీయ మాజీ ప్రధాని పీ.వీ నరసింహారావు కూడా ఉన్నారని తెలపడానికి గర్వపడుతున్నానని ఎంపీ రవిచంద్ర చెప్పారు. నిజాం నిరంకుశ పాలనపై సర్వాయి పాపన్న గౌడ్, కొమురం భీమ్, దొడ్డి కొమరయ్య, చిట్యాల ఐలమ్మ, రావి నారాయణరెడ్డి, బద్ధం ఎల్లారెడ్డి తదితరులు వీరోచితంగా పోరాడారని ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు గుర్తు చేశారు. అలాగే బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, సరోజినీ నాయుడు, కందుకూరి వీరేశలింగం, బూర్గుల రామకృష్ణారావు, స్వామి రామానంద తీర్థ, పుచ్చలపల్లి సుందరయ్య, మాడపాటి హనుమంతరావు, ముఖ్దూం మొయినుద్దీన్ తదితరులు ఈ దేశభక్తి గీతం ద్వారానే ప్రేరణ పొందారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. సత్యమేవ జయతే ఉపనిషత్తు పాఠం, జననీ జన్మభూమి ఇచ్ఛ అనే రామాయణ శ్లోకం, పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప కారల్ మార్క్స్ నినాదం మనిషి వికాసానికి మైలు రాళ్లగా నిలిచాయని, ఈ వందేమాతరం కూడా అదే కోవకు చెందిన స్ఫూర్తిదాయక గీతమని ఎంపీ రవిచంద్ర కొనియాడారు. ఈ గీతం ఇప్పటికి కూడా భారతీయుల ఐక్యత, గౌరవాన్ని పెంపొందిస్తున్నదని ఎంపీ వద్దిరాజు అన్నారు.

# రాహుల్ కన్నా ప్రియాంక బెటర్ !



లోక్‌సభలో రెండు రోజుల పాటు రెండు అంశాలపై జరిగిన చర్చలో..విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. నెహ్రూ ద్రోహం గురించి మోడీ మాట్లాడిన సందర్భంలో ఆమె గట్టిగానే ఎదుర్కొన్నారు. ఇవాళ జరుగుతున్న అభివృద్ధికి అంతా నెహ్రూ వేసిన పునాది అని గట్టిగా చెప్పగలిగారు. అలాగే వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ కలుగుతున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగల రని భావించవచ్చు. ఎందుకంటే రాహుల్ కేవలం ఓట్ చోరీ అని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. బీహార్‌లో ఇదే నినాదంతో పోయి బొక్కబోర్లా పడ్డారు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించడ లేదు. ఓట్ల తొలగింపు ద్వారా అర్హులైన ఓటర్లను గుర్తించ కేసు వేయించివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. సుప్రీం కూడా ఇదే కోరింది. కానీ రాహుల్ అది చేయలేదు. తాజాగా పార్లమెంటులోమంగళవారం సర్ ప్రక్రియపై రాహుల్ మాటలు పేలవంగా ఉన్నాయి. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం లేదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధంగానూ లేదు. కేవలం ఆర్‌ఎస్‌ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఓటుచోరీ అనేది అతిపెద్ద దేశద్రోహమని, ఎన్నికల సంఘంతో కలిసి భాజపా దానికి పాల్పడుతోందని రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ఆయన తన పాత మాటలనే రికార్డుగా వినిపించారు. దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. ఎన్నికలకు నెల ముందు మెషీన్ రీడబుల్ నమూనాలో అన్ని పార్టీలకూ ఓటర్ల జాబితాలు ఇవ్వండని అడగడంలో తప్పు లేదు. కానీ నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. దీనికి ఓట్ చోరీ కారణమని అనుకోవాలా అన్నది రాహుల్ చెప్పాలి. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. నిజానికి బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే విపక్షం పట్ల ప్రజల విముఖత ప్రతిబింబించింది. లాలూ కుటుంబంతో పాటు, రాహుల్ తీరుపై అంటే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ ప్రజాతీర్పును ప్రజలంతా అంగీకరించి నా, రాహుల్ మాత్రం అంగీకరించడం లేదు. ఓట్ చోరీ మాయలో పడ్డ ఆయన మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడం లో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు బెంగాల్ సహా అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ మొదలయ్యింది. బెంగాల్లో మమతా బెనర్జీ కూడా మొత్తం పక్రియనే వ్యతిరేకిస్తోంది. ఇది ఎంతవరకు సబబో ఆలోచించాలి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో..పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది వపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు.

# వెండి బంగారమవుతోంది

### బంగారంతో పోటీ పడుతున్న ధరలు

### సామాన్యులకు చుక్కలు చూపుతున్న రేట్లు




**న్యూఢిల్లీ,డిసెంబర్10:** నిన్నమొన్నటి వరకు పసిడి గురించి బెంగెట్టుకున్న వారంతా ఇపపుడు వెండిపైనా బెంగపడుతున్నారు. బంగారం లాగే వెండి కూడా బంగారమయ్యింది. వెండి ధరల గురించి చర్చించుకుంటున్నారు. బంగారంతో పాటు ఇన్నాళ్లు పెరిగిన వెండి.. ఇప్పుడు పసిడిని దాటేసి పరుగులు పెడుతోంది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఔన్సు 60 డాలర్లు దాటేసింది. దీన్ని అనుసరించి దేశీయంగానూ వెండి ధర భారీగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం రూ. 1.92 లక్షలు పలుకుతోంది. సరిగ్గా ఏడాదిక్రితం తొలిసారి రూ.లక్ష మార్కును దాటిన వెండి.. ఇప్పుడు రూ.2 లక్షల మార్కు దిశగా దూసుకెళుతోంది. అంతర్జాతీయ విపణిలో గత కొన్ని రోజులుగా 50 డాలర్లు పైన ట్రేడయిన వెండి ఒక్కసారిగా దాదాపు 5 శాతం మేర పెరిగింది. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, సరఫరాలో అంతరాలు దీనికి కారణమని అనలిస్టులు పేర్కొంటు న్నారు. ఫెడ్ వడ్డీ రేట్లను పావు శాతం మేర తగ్గిస్తుందన్న అంచనాలు ఈసారి బలంగా ఉన్నాయి. రేట్ల కోత చేపట్టినప్పుడు సాధారణంగా బంగారం, వెండి వంటి లోహాలకు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్ల కోత ప్రకటించాక వీటి రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకప్పుడు కేవలం ఇంట్లో వస్తువులు, ఆభరణాలకు మాత్రమే వెండిని వినియోగించేవారు. కానీ, పారిశ్రామికంగానూ వెండి అవసరం పెరుగుతుండడంతో దీనికి డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, ఈవీ కాంపోనెంట్స్‌లో దీని వినియోగం పెరిగింది. అవసరాలకు అనుగుణంగా వెండి ఉత్పత్తి పెరగకపోవడంతో ఈ లోహానికి డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలోనే గతంలో బంగారం ధర 59 శాతం మేర పెరగ్గా.. వెండి ధర ఏకంగా 107 శాతం మేర పైకెగిసింది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి కిలో వెండి రూ.1.92 లక్షల వద్ద ఉంది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. ఆర్నమెంట్‌కు వినియోగించే 22 క్యారెట్ల పసిడి ధర రూ.1.20 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,207 డాలర్ల వద్ద ట్రేడవుతోండగా.. వెండి ఔన్సు 61.49 డాలర్లు వద్ద కొనసాగుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో వెండి, బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. వెండి రికార్డు గరిష్టాలకు చేరుకుంది. బుధవారం వెండి కిలోకు ఏకంగా 9000 రూపాయలు పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ఏకంగా రూ. 2, 07, 000కు చేరుకుంది. అనుకున్నట్టుగానే రెండు లక్షలు దాటేసింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1, 30, 310కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 19, 450కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 30, 460కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 19, 600కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 30, 310కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 19, 450కి చేరింది. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ దోపిడీ ప్లాన్

### రైజింగ్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్న హరీష్



**హైదరాబాద్,డిసెంబర్10:** కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. ఇది గ్లోబల్ సమ్మిట్ కాదని.. భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్ అంటూ వ్యాఖ్యలు చేశారు. అందాల పోటీల్లాగే, ఏఐ సమ్మిట్ లాగే.. గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అయ్యిందంటూ కామెంట్స్ చేశారు. పెట్టుబడుల కట్టు కథలు చెప్పి, కోట్లు ఖర్చు చేసి గ్లోబల్ సమ్మిట్‌ను అట్టర్ ఫ్లాప్ చేశారంటూ ఫైర్ అయ్యారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట రియల్ ఎస్టేట్ స్కాంకు తెరతీశారంటూ మాజీ మంత్రి సంచలన ట్వీట్ చేశారు. 'విజన్ డాక్యుమెంట్‌లో విజన్ లేదు, దాన్ని చేరుకునే మిషన్ లేదు, విజన్ డాక్యుమెంట్ కాదు.. 'విజన్ లెస్' డాక్యుమెంట్. క్యూర్, ప్యూర్, రేర్ అంటూ అంటున్న రేవంత్ రెడ్డి.. తెలంగాణను కొల్లగొడుతున్న చోర్. గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి అందులో ఎన్ని కంపెనీలు గ్రౌండ్ అయ్యాయి ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి.. దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి గ్లోబల్ సమ్మిట్ వేదికగా టోనీ ÷–లబెయిర్, సుబ్బారావు ఇచ్చిన కితాబు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు. రేవంత్ రెడ్డి నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదు, భూములు అమ్మకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్' అంటూ హరీష్ రావు ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

# గోవాలో ఘోరం

గోవా నైట్‌క్లబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం మన వ్యవస్థల బాధ్యతారాహిత్యానికీ, ప్రజల ప్రాణాలపట్ల ఉన్న నిర్లక్ష్యానికీ నిలువెత్తు నిదర్శనం. అధికారులు ఏమాత్రం నిబంధనలకు అనుగుణంగా నడుచుకున్నా, పాతికమంది ప్రాణాలు హరించిన ఈ దురటన జరిగేది కాదు. అర్పోరా గ్రామ సమీపంలోని ఈ నైట్‌క్లబ్‌లో ప్రమాదం సంభవించగానే రెండేళ్ళుగా అది ఏ అనుమతులూ లేకుండా, చట్టవిరుద్ధంగా నడుస్తున్న సత్యాన్ని అప్పుడే తెలుసుకున్నట్టుగా మొఖంపెట్టి, సంతాపంతో పాటు, బాధితకుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఈ దేశంలో అక్రమాలు యథేఛగా సాగిపోతూంటాయి, నేరాలూ ఘోరాలూ జరగ్గానే ఎప్పటిలాగానే ప్రభుత్వాలు కొత్తగా ఆశ్చర్యపోతూంటాయి. దురటనలకు కారణమైన సంస్థలకో, పరిశ్రమలకో, వాహనాలకో అనుమతులే లేవని తేల్చేస్తే తప్పు వాటిమీదకు పోతుందని, ప్రజలద ృష్టి మారిపోతుందని ప్రభుత్వాలకు ఓ నమ్మకం.రెండేళ్ళక్రితం గ్రామపంచాయితీ ఈ నైట్‌క్లబ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నోటీసులు ఇచ్చి, మరో ఆర్నెల్ల తరువాత కూల్చివేతకు సిద్ధపడితే, స్థలయజమాని పై స్థాయిలో ప్రయత్నాలు చేసుకొని, యథాతథస్థితి కొనసాగేట్టుగా చూసుకున్నాడట. రాష్ట్ర శాసనసభలో ఈ నైట్‌క్లబ్ ప్రస్తావన ఆగస్టులో వచ్చి, మొత్తంగా అక్రమ నైట్‌క్లబ్‌లమీద చర్చ జరిగింది కనుక, ఇదేమీ ప్రభుత్వం ద ృష్టికి రాని, దానికి తెలియకుండా పోయిన అంశమేమీ కాదు. కఠినచర్యలు ఇప్పుడు హామీపడుతున్న ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మూడునెలల క్రితమే ఆ పనిచేసివుంటే ఇన్ని ప్రాణాలు పోయేవి కాదు. అడ్డదారిలో ఏర్పడిన క్లబ్ కనుక, ఏదీ సక్రమంగా లేకపోయింది.

ఏకైక రాకపోకలమార్గం ఇరుకుగా ఉండటమే కాక, తగలబడుతున్న ఆ నైట్‌క్లబ్ దగ్గరగా పోయేందుకు కూడా అవకాశం లేక ఫైరింజన్లు అరకిలోమీటరు ఇవతలే ఆగిపోవాల్సివచ్చిందట. విస్త ృతంగా వెదురు, గడ్డి ఉపయోగించి తయారుచేసిన పైకప్పును సులువుగా తగలబడే పదార్థాలతో మరింత సుందరంగా ఈ నైట్‌క్లబ్ నిర్వాహకులు తీర్చిదిద్దారు. టపాసులు కాలిస్తే తగలబడుతుందన్న భయం, జ్ఞానం వారికి లేవనుకోవాలో, పోతేపోనీ అన్న నిర్లక్ష్యమో తెలియదు. మంటల్లో బయటకుపోయే దారిలేక వంటసామగ్రితో పాటు ఇతరత్రా అనేకం ఉంచిన ఇరుకైన బేస్‌మెంట్‌లోకి దిగి, తిరిగి పైకి రాలేక చాలా



మంది పొగకు ఉక్కిరిబిక్కిరై ప్రాణాలు విడిచారట. మంటలు రేగగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆ చీకట్లో జరిగిన తొక్కిసలాట అధిక ప్రాణనష్టానికి దోహదం చేసిందని అంటున్నారు.

# రెండో స్థానానికి విరాట్ కోహ్లీ

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ విడుదల

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజాగా రిలీజ్ చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రెండో స్థానానికి దూసుకెళ్లాడు. రీసెంట్‌గా సౌతాఫ్రికా సిరీస్‌లో సత్తా చాటడంతో విరాట్ రెండు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. ప్రస్తుతం అతడు 773 రేటింగ్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అగ్రస్థానం నిలబెట్టుకున్నాడు. అతడు 781 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. వన్డే ర్యాకింగ్స్‌లో టాప్ – 2 స్థానాల్లో టీమ్ఇండియా బ్యాటర్లే ఉండడం విశేషం.టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ఇచ్చేసిన భారత సీనియర్ బ్యాటర్లు కోహిత్, విరాట్ వన్డేల్లోనే కొనసాగుతున్నారు. 2027 వరల్డ్‌కప్‌లో ఆడడమే లక్ష్యాంగా పెట్టుకున్న ఈ ఇద్దరు స్టార్లు ప్రస్తుతం అత్యుత్తమ ఫామ్ కనబరుస్తున్నారు. టీమ్ఇండియా ఆడిన గత రెండు సిరీస్‌ల్లో ఈ ఇద్దరే టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆక్టోబర్‌లో ఆసీస్ సిరీస్‌లో రోహిత్ శర్మ, ఇటీవల ముగిసిన సౌతాఫ్రికా సిరీస్‌లో విరాట్ కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' లుగా నిలిచారు. దీంతో లేటెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్ 2 స్థానాల్లో కొనసాగుతున్నారు.అక్టోబర్ నెలలో ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ ఆకట్టుకున్నాడు. దాదాపు ఏడు నెలల తర్వాత ఈ సిరీస్‌తోనే ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. తొలి మ్యాచ్‌లో విఫలమైనా, తర్వాత రెండు వన్డేల్లోనూ హిట్‌మ్యాన్ తనదైన ఆటలో అలరించాడు. అడిలైడ్‌లో 73 పరుగులతో ఆకట్టుకున్న రోహిత్, సిడ్నీ వన్డేలో (121లిపరుగులు ) సెంచరీతో అదరగొట్టాడు. మొత్తం సిరీస్‌లో 202 పరుగులు బాదాడు.ఇటీవల ముగిసిన సౌతాఫ్రికా సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. మూడు మ్యాచ్‌ల్లోనూ రాణించాడు. ఇందులో 2 సెంచరీలు, 1 హాఫ్ సెంచరీ ఉండడం విశేషం. 151 యావరేజ్‌తో విరాట్ 302 పరుగులు చేశాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. వన్డే కెరీర్‌లో విరాట్‌కు ఇది 12వ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్. ఈ క్రమంలో శ్రీలంక మాజీ క్రికెటర్ సనత్ జయసూర్య (11)ను అధిగమించాడు. ఈ లిస్ట్‌లో సచిన్ తెందూల్కర్ (15) తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక బౌలింగ్ విభాగంలో స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. 655 రేటింగ్ పాయింట్లతో కుల్దీప్ వన్డే బౌలింగ్ ర్యాకింగ్స్‌లో ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. 710 రేటింగ్స్‌తో అఫ్గానిస్థాన్ బౌలర్ రషీద్ ఖాన్ టాప్‌లో ఉండగా, ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ (670 రేటింగ్స్) రెండో ప్లేస్‌లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో అఫ్గాన్ క్రికెటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (334 రేటింగ్స్) టాప్‌లో ఉన్నాడు.



# టీ20 క్రికెట్‌లో మోహిత్ అహ్లావత్ విధ్వంసం



క్రికెట్ ప్రపంచంలో, ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌లో పరుగుల వరద పారడం మనం చూస్తూనే ఉంటాం. కానీ, తాజాగా జరిగిన ఒక మ్యాచ్‌లో నమోదైన గణాంకాలు చూస్తే క్రీడాభిమానులు ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టాల్సిందే. ఎందుకంటే, ఆ మ్యాచ్‌లో 20 ఓవర్లలో ఒక జట్టు ఏకంగా 416 పరుగులు చేసింది. అంతకంటే మరో విశేషం ఏమిటంటే, ఈ మ్యాచ్‌లో ఒకే ఒక్క బ్యాటర్ 300 పరుగుల మైలురాయిని దాటేయడం గమనార్హం.ఇప్పుడు చెప్పబోయే ఆటగాడు భారతదేశానికి చెందినవాడు. అతను టీ20 క్రికెట్‌లోనే 300 పరుగులు చేశాడు. భారత బ్యాట్స్‌మన్ మోహిత్ అహ్లావత్ 2017లో జరిగిన టీ20 మ్యాచ్‌లో ట్రిపుల్ సెంచరీ సాధించాడు. ఆ మ్యాచ్‌లో అతను టీ20 క్రికెట్‌లో విధ్వంసం సృష్టించాడు. 39 సిక్సర్లు, 14 ఫోర్లు బాదాడు. ఈ మ్యాచ్‌లో బౌలర్లు భారత బ్యాటర్ ముందు తేలిపోయారు. మావి %శ×% వర్సెస్ ఫ్రెండ్స్ 11 మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ అద్భుతం చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో, 21 ఏళ్ల మోహిత్ అహ్లావత్ ట్రిపుల్ సెంచరీ సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ టీ20 మ్యాచ్ ఢిల్లీలో జరిగిన స్థానిక క్రికెట్ టోర్నమెంట్‌లో జరిగింది. ఫ్రెండ్స్ 11తో జరిగిన మ్యాచ్‌లో మోహిత్ అహ్లావత్ 72 బంతుల్లో 300 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో, మోహిత్ అహ్లావత్ కేవలం సిక్సర్ల ద్వారానే 234 పరుగులు చేశాడు. 56 పరుగులు ఫోర్ల ద్వారా వచ్చాయి. అంటే, తన పరుగులలో ఎక్కువ భాగం సిక్సర్ల ద్వారానే సాధించాడు. మావి ఎలెవెన్ ఈ %u%20 మ్యాచ్‌లో 20 ఓవర్లలో 416 పరుగులు చేసింది. దీనికి సమాధానంగా ఫ్రెండ్స్ 11 జట్టు 216 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో ఆ జట్టు ఘోర పరాజయాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. రికార్డు సృష్టించిన టీ20 క్రికెట్ ఆటగాడు మోహిత్ అహ్లావత్ గురించి మాట్లాడితే, అతను భారత జట్టు స్టార్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్‌తో కలిసి రంజీ ట్రోఫీలో ఆడాడు. పంత్ కంటే ముందు రంజీ ట్రోఫీలో ఆడే అవకాశం అతనికి లభించింది. కానీ, అతని కెరీర్ ముందుకు సాగలేదు. ఆర్థిక పరిమితులు దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. గతంలో, టీ20 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ (175లి ఐపీఎల్‌లో) పేరిట ఉండేది. అంతర్జాతీయ టీ20లలో ఆరోన్ ఫించ్ (172) పేరిట ఉంది. అలాగే, ఇటీవలే నేపాల్ జట్టు అంతర్జాతీయ టీ20లో 314 పరుగులు చేసి రికార్డు సృష్టించింది.

# ఆర్‌సీబీ షార్ట్‌లిస్ట్ సిద్ధం




డిఫెండింగ్ ఛాంపియన్‌లైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, జోష్ హాజిల్‌వుడ్, కెప్టెన్ రజత్ పాటిదార్ వంటి స్టార్లతో కూడిన 17 మంది ఆటగాళ్ల స్థిరమైన కోర్‌తో ఇండియన్ ప్రీమియర్ లీగ్ మినీ-వేలంలోకి ప్రవేశిస్తోంది. ఛాంపియన్‌షిప్ హోదాను కాపాడుకోవడానికి చిన్నపాటి, నిర్దిష్టమైన ఖాళీలను భర్తీ చేయడమే వ్యూహంగా వేలంలోకి దిగనుంది. విదేశీ ఆల్ రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, పేసర్ లుంగి ఎన్‌గిడిల విడుదలతో ఏర్పడిన ఎనిమిది ఖాళీలను (రెండు విదేశీ స్థానాలతో సహా) భర్తీ చేయడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ. 16.40 కోట్లను ఖర్చు చేయనుంది. జోష్ హాజిల్‌వుడ్, నువాన్ తుషారాలతో పేస్ ఎటాక్‌లో డెప్త్ ఉన్నప్పటికీ, హాజిల్‌వుడ్ పనిభారం నిర్వహణ, తుషారాకు తగినంత అనుభవం లేకపోవడం వల్ల, వారితో భాగస్వామిగా ఉండటానికి లేదా రొటేట్ చేయడానికి అధిక ప్రభావం చూపే, ప్రపంచ స్థాయి పేస్ బౌలర్ అవసరం. ఇది అత్యంత కీలకమైన విదేశీ ప్లేయర్ అవసరాన్ని సూచిస్తుంది. ఢిల్లీ క్యాపిటల్స్ విడుదల చేసిన అన్రిచ్ నోర్జే ఇందుకు సరిగ్గా సరిపోతాడు. అతను పవర్ ప్లే, మిడిల్ ఓవర్లలో 145o కిమీ/గం వేగంతోపాటు దూకుడును అందిస్తాడు. ఇది బెంగళూరులోని ఫ్లాట్ పిచ్‌లపై విలువైన ఆస్తిగా మారనుంది. దక్షిణాఫ్రికాకు చెందిన మరో ఆప్షన్ గెరాల్డ్ కోయెట్జీ (గుజరాత్ విడుదల చేసింది). అతను హాజిల్‌వుడ్‌కు దీర్ఘకాలిక బ్యాకప్‌గా పనిచేయడానికి విలువైన ఎంపిక. డెత్ ఓవర్లలో స్పెషలిస్ట్‌గా నిరూపించుకున్న ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తిరిగి తీసుకురావాలని కూడా భావించవచ్చు. టాప్-ఆర్డర్ పటిష్టంగా ఉంది. కానీ ఫ్రాంచైజీకి స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని, మిడిల్ ఆర్డర్‌లో గేమ్‌లను ముగించగల నాణ్యమైన భారతీయ బ్యాటర్ అవసరం. పరిమిత విదేశీ స్లాట్‌లతో సౌలభ్యాన్ని అనుమతించడానికి ఇది కీలక దృష్టిగా మిగిలిపోయింది. వెంకటేష్ అయ్యర్ వారి ప్రధాన లక్ష్యం. అతను ఎడమచేతి వాటం పవర్, 3 లేదా 4వ స్థానంలో బ్యాటింగ్ చేసే సామర్థ్యం, ఉపయోగకరమైన పేస్ బౌలింగ్‌ను అందిస్తాడు. మరింత వాస్తవిక, బడ్జెట్‌కు అనుకూలమైన లక్ష్యం మహిపాల్ లోమ్రోర్. అతను మిడిల్ ఆర్డర్‌తోపాటు లెగ్-స్పిన్‌ను సంధించగల ఎడమచేతి వాటం భారతీయ ఆల్ రౌండర్. ఫ్రాంచైజీ పృథ్వీ షా వైపు కూడా చూడవచ్చు. కృనాల్ పాండ్యా, సుయాష్ శర్మల స్పిన్ ద్వయాన్ని అట్టిపెట్టుకున్నప్పటికీ, 2025లో నిజమైన, అధిక ప్రభావం చూపే వికెట్లు తీసే స్పిన్నర్ లేరు. దీనిని పరిష్కరించడానికి, వారు ఎలైట్ (అత్యుత్తమ) ఆప్షన్ కోసం ప్రయత్నిస్తారని భావిస్తున్నారు. రవి బిష్ణోయ్మి డిల్ ఓవర్లలో వికెట్లు తీసే ముప్పును ఎక్కువగా కలిగి ఉంటాడు. ఇది జట్టుకు భారీ అప్‌గ్రేడ్ అవుతుంది. వనిందు హసరంగా తో పునఃకలయిక కూడా సాధ్యమే. లియామ్ లివింగ్‌స్టోన్ విడుదలతో ఒక బహుముఖ విదేశీ బ్యాటింగ్ ఆల్ రౌండర్ కోసం చిన్న ఖాళీని మిగిల్చింది. మైఖేల్ బ్రేస్‌వెల్ ఈ అవసరానికి సరిగ్గా సరిపోతాడు. అతను మిడిల్ ఆర్డర్‌లో ఎడమచేతి వాటం బ్యాటింగ్, పొదుపుగా ఉండే ఆఫ్-స్పిన్‌ను అందిస్తాడు. దీని వలన అతను కృనాల్ పాండ్యాకు అనుబంధంగా ఉండటానికి అనువైన రొటేషనల్ ప్లేయర్‌గా మారుతాడు.

# గౌతమ్ గంభీర్‌పై షాహిద్ అఫ్రిది ఫైర్!



భారత క్రికెట్ జట్టులో వెటరన్ ఆటగాళ్ల కొనసాగింపుపై చర్చ జరుగుతున్న సమయంలో పాక్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల అద్భుత ప్రదర్శన తర్వాత షాహిద్ అఫ్రిది వారిని 2027 ప్రపంచ కప్ వరకు జట్టులో కొనసాగించాలని గట్టిగా వాదించారు. ఈ నేపథ్యంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. భారత వన్డే ప్రణాళికలకు ఈ ఇద్దరూ చాలా కీలకమని అభిప్రాయపడ్డారు.టీమిండియా ఈ ఇద్దరు దిగ్గజాలను తెలివిగా ఉపయోగించుకోవాలని అఫ్రిది సూచించారు. బలహీన జట్లతో ఆడేటప్పుడు వారికి విశ్రాంతి ఇచ్చి కీలక సిరీస్‌లలో వారిని ఆడించాలని చెప్పారు. "విరాట్, రోహిత్ భారత బ్యాటింగ్ లైనప్‌కు వెన్నెముక అనే వాస్తవాన్ని అంగీకరించాలి. ఇటీవల వన్డే సిరీస్‌లలో వారు ఆడిన తీరు చూస్తే, వారు 2027 ప్రపంచ కప్ వరకు సులభంగా ఆడగలరని నమ్మకంగా చెప్పవచ్చు. మీరు ఈ ఇద్దరు స్టార్స్‌ను రక్షించుకోవాలి. భారతదేశం ఒక బలహీనమైన జట్టుతో ఆడుతున్నప్పుడు, కొత్త ఆటగాళ్లను ప్రయత్నించి, విరాట్, రోహిత్‌లకు విశ్రాంతి ఇవ్వవచ్చు." అని అఫ్రిది వ్యాఖ్యానించారు.గత కొన్నేళ్లుగా అఫ్రిది, గౌతమ్ గంభీర్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ఆల్‌రౌండర్ భారత హెడ్ కోచ్‌ను విమర్శించడానికి వెనుకాడలేదు. గంభీర్ సారథ్యంలో టీమిండియా మిశ్రమ ఫలితాలను చవిచూసింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌ను గెలిచినప్పటికీ, టెస్టుల్లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మరియు దక్షిణాఫ్రికా చేతుల్లో ఓటమిని ఎదుర్కొంది. "గౌతమ్ తన పదవీకాలాన్ని ప్రారంభించిన తీరు చూస్తే, తాను అనుకున్నది, తాను చెప్పింది మాత్రమే సరైనదని అతను భావించినట్లు అనిపించింది. కానీ కొంతకాలం తర్వాత, మీరు ఎల్లప్పుడూ సరైనవారు కారని నిరూపించబడింది." అని అఫ్రిది విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా అఫ్రిది వన్డేల్లో అత్యధిక సిక్సర్ల రికార్డును బద్దలు కొట్టినందుకు రోహిత్ శర్మను అభినందించారు. ఐపీఎల్ 2009లో డెక్కన్ ఛార్జర్స్ తరఫున రోహిత్‌తో కలిసి ఆడిన అఫ్రిది, అప్పుడే రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్ద స్టార్ అవుతాడని తనకు తెలుసునని చెప్పారు.

## మహికా శర్మ వల్లే నేను రాణించాను: టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా



తన ప్రియురాలు మహికా శర్మ వల్లే సౌతాఫ్రికాతో తొలి టీ20లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చానని టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం కటక్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 101 పరుగుల భారీ తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది.176 పరుగుల లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 74 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా(28 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు. బౌలింగ్‌లోనూ ఒక వికెట్ తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన వేళ అద్భుత బ్యాటింగ్‌తో జట్టుకు భారీ స్కోర్ అందించాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్నాడు.ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న హార్దిక్ పాండ్యా.. సానుకూల దృక్పథమే తనను తిరిగి మైదానంలో అడుగు పెట్టేలా చేసిందని తెలిపాడు. 'గాయం తర్వాత నేను మరింత దృఢంగా తిరిగి వచ్చాను. గాయాలు మనల్ని మానసికంగా పరీక్షిస్తాయి. బలంగా నిలబడటం వల్లే నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. నా మీద నాకు చాలా నమ్మకం ఉంది. నిజానికి మనల్ని మనం కచ్చితంగా నమ్మాలి.


# టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధం

**• నేడు న్యూ ఛండీగఢ్ వేదికగా రెండో టీ20**

సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. న్యూ ఛండీగఢ్ వేదికగా గురువారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభమయ్యే రెండో టీ20లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. కటక్ వేదికగా జరిగిన తొలి టీ20లో టీమిండియా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తా చాటి 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టీ20లోనూ అదే జోరును కొనసాగించాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు చెత్త బ్యాటింగ్‌తో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సౌతాఫ్రికా.. రెండో టీ20లోనైనా గట్టి పోటీనివ్వాలనే పట్టుదలతో ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.తొలి టీ20 విజయంతో టీమిండియా కాంబినేషన్‌లో మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. గాయం నుంచి కోలుకొని బరిలోకి దిగిన శుభ్‌మన్ గిల్ తీవ్రంగా నిరాశపర్చాడు. వన్డే, టెస్ట్‌ల్లో సత్తా చాటుతున్న గిల్.. టీ20ల్లో మాత్రం ఆశించిన రీతిలో రాణించలేకపోతున్నాడు. తొలి మ్యాచ్‌లో 4 పరుగులే చేసి వెనుదిరిగాడు.రెండో టీ20లోనైనా అతను సత్తా చాటాలి. లేదంటే అతనిపై విమర్శలు ఎక్కువవుతాయి. ఫస్ట్ డౌన్‌లో ఆడిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తీవ్రంగా నిరాశపర్చాడు. ఈ ఏడాది సూర్య ఒక్క మ్యాచ్‌లో కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. గత 15 ఇన్నింగ్స్‌ల్లో ఒక్క హాఫ్ సెంచరీ లేదు. కనీసం రెండో టీ20లోనైనా సూర్య సత్తా చాటాలి. తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబేలు కూడా బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. తొలి టీ20లో హార్దిక్ పాండ్యా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. అతను అదే జోరు కొనసాగించాల్సి ఉంది. చివర్లో తనదైన శైలిలో ఫినిష్ ఇచ్చేందుకు జితేష్ సిద్ధంగా ఉన్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తికి తిరుగులేదు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లు కూడా సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలోనే తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం కనిపించడం లేదు. దాంతో హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లకు మరోసారి నిరాశే ఎదురవ్వనుంది. భారత్ తుది జట్టు(అంచనా) శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ/సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్/అర్ష్‌దీప్ సింగ్ భారత టీ20 టీమ్ శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ,సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.



# 'ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47'






విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రతిషా'త్మక చిత్రానికి సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్‌ను చిత్రబ ృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాకు 'ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47' అనే క్లాస్ టైటిల్‌ను ఖరారు చేసింది. అంతేకాకుండా ఈరోజు నుంచే రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభమైనట్లు తెలిపింది.

ఈ సందఠరేగా విడుదల చేసిన ఫస్ట్ లుక్‌లో వెంకటేశ్ ఒక పరౌక్ట్ ఫ్యామిలీ మ్యాన్‌గా ఆహ్లాదకరంగా కనిపిస్తున్నారు. ఈ లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాక ృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.గతంలో వెంకటేశ్ హీరోగా నటించగా, త్రివిక్రమ్ కథ, మాటలు సమకూర్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలు కుటుంబ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుని, క్లాసిక్‌లుగా నిలిచాయి. చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ ఈ కాంబో రిపీట్ అవుతుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా శ్రీనిధి శెట్టిని ఎంపిక చేసినట్లు సమాచారం. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, వచ్చే ఏడాది వేసవి కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.




## రమ్యకృష్ణ, ఐశ్వర్య రాజేశ్ లీడ్ రోల్స్ లో

# 'పాకశాల పంతం'

ప్రముఖ నటీమణులు రమ్యక ృష్ణ, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఒక ఆసక్తికరమైన చిత్రం ప్రారంభమైంది. వీరిద్దరి కలయికలో 'పాకశాల పంతం' అనే నూతన చిత్రం మంగళవారం లాంఛనంగా ప్రారంభోత్సవం జరుపుకుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్ కోసం ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. కరణ్ తుమ్మకొమ్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ప్రవీణ్ కొల్లా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఈ సినిమాలో రమ్యక ృష్ణ, ఐశ్వర్య రాజేశ్ తో పాటు సంజయ్ స్వరూప్, మహత్ రాఘవేంద్ర, ఎస్.ఎస్. కాంచి, సమీరా భరద్వాజ్, రాజేశ్ రాచకొండ, మాయ నెల్లూరి వంటి నటులు ఇతర ముఖ్య పాత్రలలో కనిపించనున్నారు. చిత్ర యూనిట్ విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ద్వారా ఇది వంటల పోటీ నేపథ్యంలో సాగే కథ అని తెలుస్తోంది.

'పాకశాల పంతం' అనే టైటిల్‌తో పాటు పోస్టర్‌లో వంటగది నేపథ్యం ఉండటంతో, రెండు ప్రధాన పాత్రల మధ్య జరిగే భావోద్వేగపూరితమైన లేదా హాస్యభరితమైన పోటీ చుట్టూ కథ తిరుగుతుందని అంచనా వేస్తున్నారు. మంగళవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.

# ఓటీటీలో 'ఘటన' ..

## అవసరాలు మార్చే అవతారాలు!




'ఈటీవీ విన్'లో ప్రతివారం 'కథాసుధ' శీర్షిక క్రింద లఘుచిత్రాలను అందిస్తూ వస్తున్నారు. అరగంటలోపు నిడివి కలిగిన ఈ లఘుచిత్రాలు (మైక్రో డ్రామా) ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సింపుల్ గా అనిపించే కథాకథనాలతో రూపొందుతున్న ఈ లఘు చిత్రాలు, ఎమోషనల్ గా కనెక్ట్ అవుతున్నాయి. అలా ఈ నెల 7వ తేదీన అందుబాటులోకి వచ్చిన కంటెంట్ గా 'ఘటన' కనిపిస్తుంది. రావణ్ రెడ్డి .. గడ్డం శ్రీనివాస్ .. చాందినీరావు నటించగా, కొత్తపల్లి సురేశ్ దర్శక నిర్మాతగా వ్యవహరించాడు. నాణానికి బొమ్మ - బొరుసు మాదిరిగా, మంచి - చెడు ప్రతి మానిషిలోనూ ఉంటాయి. మనం ఎదుటి వ్యక్తులతో ప్రవర్తించే తీరును బట్టి, ఎదుటివారు మనతో మసలుకునే విధానం ఉంటుంది. ఎవరినీ కూడా పూర్తి మంచివాడు .. పూర్తిగా చెడ్డవాడు అని చెప్పలేము. పరిస్థితులు .. సందరాలే వ్యక్తులను .. వారి స్వభావాలను ప్రభావితం చేస్తూ ఉంటాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన లఘుచిత్రం ఇది. మనకి ఏం తెలుసు? ఎంత తెలుసు? అనే దానికంటే కూడా, మనకి తెలిసిన విషయాన్ని అవతలివారికి అర్థమయ్యేలా చెప్పగలిగినప్పుడే దాని అసలైన ప్రయోజనం నెరవేరుతుంది. అలా చాలా సింపుల్ కంటెంట్ తీసుకుని అంతే సింపుల్ గా అర్థమయ్యేలా దర్శకుడు ఈ కథను ఆవిష్కరించాడు. మూడే మూడు పాత్రలతో చేసిన ఈ ప్రయత్నం ఆలోచింపజేసేలా ఉంటుంది.

# నాగార్జునపై యాంటీ ఏజింగ్ పరిశోధనలు చేయాలి: విజయ్ సేతుపతి

తమిళ నటుడు విజయ్ సేతుపతి, టాలీవుడ్ కింగ్ నాగార్జునపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చిన్నప్పటి నుంచి చూస్తున్నా నాగార్జున వయసులో ఏమాత్రం మార్పు రాలేదని, ఆయనకు అసలు వయసు ఎందుకు పెరగడం లేదో తనకు అర్థం కావట్లేదని చమత్కరించారు. జియో హాట్‌స్టార్ నిర్వహించిన 'సౌత్ అన్‌బాండ్' కార్యక్రమంలో ఈ సరదా సంభాషణ చోటుచేసుకుంది.ఈ కార్యక్రమంలో నాగార్జున, మోహన్‌లాల్‌తో కలిసి విజయ్ సేతుపతి పాల్గొన్నారు. ఈ సందఠరేగా నాగార్జునను ఉద్దేశించి మాట్లాడుతూ, "నా చిన్నప్పుడు ఆయన ఎలా ఉన్నారో, ఇప్పటికీ అలానే ఉన్నారు. యాంటీ ఏజింగ్‌పై పరిశోధనలు చేసేవాళ్లు ఆయన్ని కొన్ని రోజులు తీసుకెళ్లి పరీక్షలు చేయాలి. ఆయన జుట్టు, ఎనర్జీ ఏమాత్రం తగ్గలేదు. నాకు మనవళ్లు పుట్టి, వాళ్లు పెద్దవాళ్లయినా సరే నాగార్జున ఇలానే యంగ్‌గా ఉంటారు" అని సరదాగా వ్యాఖ్యానించారు.ఇదే వేదికపై తాను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న బిగ్‌బాస్ కార్యక్రమం గురించి కూడా విజయ్ సేతుపతి మాట్లాడారు. ఇలాంటి షోలకు యాంకర్‌గా ఉండటం చాలా తేలికని అభిప్రాయపడ్డారు. దీనివల్ల ప్రజల ప్రవర్తనను దగ్గర నుంచి గమనించే అవకాశం దొరికిందని తెలిపారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి తమిళ బిగ్‌బాస్ సీజన్ 8కి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.



# ఫంకీ పాప..

## నెక్ట్స్ ఏం చేస్తుందో..?



డ్రాగన్ సినిమాతో యూత్ ఆడియన్స్ లో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది కయదు లోహర్. అమ్మడు తెలుగులో శ్రీ విషు?తో అల్లూరి సినిమా చేసింది. ఆ టైంలో అసలు మన ఆడియన్స్ ఆమెను గుర్తించలేదు కానీ ప్రదీప్ రంగనాథన్ డ్రాగన్ హిట్ అవ్వడంతో కయదుకి తెలుగులో సూపర్ పాపులారిటీ వచ్చింది. వెంటనే అమ్మడికి విశ్వక్ సేన్ ఫంకీ సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. అనుదీప్ కెవి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఫంకీ సినిమాలో కయదు లోహర్ గ్లామర్ తో పాటు యాక్టింగ్ లో కూడా ఇంప్రెస్ చేస్తుందని అంటున్నారు. కయదు లోహర్ ఆడియన్స్ ని ఇంప్రెస్.. ఫంకీ టీజర్ తోనే ఆడియన్స్ ని ఇంప్రెస్ చేయగా సినిమా తప్పకుండా అంచనాలను అందుకునేలా ఉంటుందని చెబుతున్నారు. ఐతే కయదు లోహర్ ఫంకీ తర్వాత నెక్ట్స్ టాలీవుడ్ మూవీ ఏదన్నది ఇంకా క్లారిటీ రాలేదు. అసలైతే రవితేజతో ఒక సినిమా చేస్తుందన్న టాక్ వచ్చింది. కానీ అందులో నిజం లేదని తేలింది. రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తిలో కయదు నటిస్తుందని అన్నారు కానీ ఆ మూవీలో కయదు లోహర్ ప్లేస్ కాలేదు. ఫంకీ పాప ఆ సినిమా రిలీజ్ తర్వాత నెక్ట్స్ ఆఫర్ ఎంచుకోవాలని చూస్తుందో ఏమో కానీ విశ్వక్ సినిమా ఒక్కటి మాత్రమే తెలుగులో చేస్తుంది కయదు లోహర్. ఐతే ఆడియన్స్ లో ఆమెకున్న హాట్ ఇమేజ్ కి తెలుగులో ఎలా లేదన్నా ఒక ఐదారు సినిమాలు వెంట వెంటనే పడేలా ఉన్నాయి. ఐతే ఫంకీ హిట్ పడితే ఆ ఛాన్స్ లు వస్తాయని చెప్పొచ్చు. ఫంకీలో కూడా కయదు తన గ్లామర్ షోతో ఆడియన్స్ ని బుట్టలో వేసే ప్రయత్నాలు చేస్తుందని తెలుస్తుంది. విశ్వక్ సేన్ కూడా ఫంకీతో ఒక మంచి సక్సెస్ అందుకోవాలని చూస్తున్నాడు. అనుదీప్ డైరెక్షన్ లో సినిమా కాబట్టి మినిమం గ్యారెంటీ ఉన్నట్టే.

# ఆత్మహత్యకు సిద్ధపడిన సినీ నటి పావలా శ్యామల.. కాపాడిన పోలీసులు



తెలుగు చిత్ర పరిశ్రమలో సుమారు 300 సినిమాల్లో సహాయ నటిగా గుర్తింపు పొందిన పావలా శ్యామల దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తీవ్ర అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు సిద్ధపడిన ఆమెను, ఆమె కుమార్తెను పోలీసులు కాపాడి ఓ స్వఛరేద సంస్థలో చేర్పించారు.కొంతకాలంగా పావలా శ్యామల, ఆమె కుమార్తె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనికితోడు సినిమా అవకాశాలు లేకపోవడంతో వారి పరిస్థితి దుఠరేంగా మారింది. ఈ క్రమంలో కొందరు వారిని ఓ హెూమ్‌లో చేర్పించగా, అక్కడ వారి ఆరోగ్యం మరింత క్షీణించి మంచానికే పరిమితమయ్యారు. సరైన సేవలు అందించలేమంటూ ఆ హెూమ్ నిర్వాహకులు వారిని బయటకు పంపించేశారు.దీంతో దిక్కుతోచని స్థితిలో రోడ్డుపైకి చేరిన శ్యామల ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వారిని కార్ఖానా పోలీస్ స్టేషన్ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని తిరుమలగిరి ఏసీపీ రమేశ్ ద ృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఏసీపీ, వారిని కార్ఖానాలోని ఆర్కే ఫౌండేషన్ హెల్త్‌కేర్ సెంటర్‌కు తరలించారు.ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణ వారికి ఆశ్రయం కల్పించి, అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. తమ సంస్థ ద్వారా అనాథ వ ృద్ధులకు సాయం అందిస్తున్నామని, ఎవరైనా అవసరంలో ఉంటే తనను సంప్రదించాలని (9866491506) ఆయన కోరారు.